# సంతకం



పురాణం సుబ్రహ్మణ్య శర్మ

పైన కంకర జల్లిన మట్టిరోడ్డు మీద చితచిత లాడుతున్న బురదలోంచి బస్సు మెల్లగా జారుతోంది. ఇష్టం వున్నా లేకపోయినా, కష్టమైనా నిష్ఠూరమైనా సంసారాన్ని సాగించే పెద్దింటి ఆడబడుచులా అది తెరిపిలేకండా కురుస్తున్న వానలో ముందుకు పోవడానికే ప్రయత్నిస్తోంది. బస్సు చాలా పాతది. కిటికీలకు అద్దాలు లేవు. లోపలికి జల్లు కొట్టకుండా టార్పాలిను ముక్కలు వున్నాయి. అవి టప టపా కొట్టుకుని లోపలి ప్రయాణీకులకు చికాకు కలిగిస్తున్నాయి. బస్సునిండా జనం వున్నారు. అంతా మట్టిపనిచేసే కూలీలే- చుట్టలు కాలుస్తున్నారు-బస్సు లోపల అంతా గలీజుగా వుంది.

కిటికీ పక్క కూర్చున్న సుశీల అంత జల్లులోనూ ముఖం బయటకు పెట్టి లాగటానికి బస్సుపడే అవస్థనూ కుండపోతగా కురుస్తున్న వర్షంలో వెర్రెత్తిపోయిన ప్రకృతినీ చూస్తూ కాలక్షేపం చేస్తున్నది. ఆ అమ్మాయి వొళ్ళో చిన్న సంచీని పట్టుకు కూర్చుంది. వెలిసిపోయిన ఆకుపచ్చ తీగల చీర కట్టుకున్న ఆ అమ్మాయి పొదరింట్లో చిక్కుకున్న తెలివితక్కువ పిల్లలావుంది. ముక్కుకీ చెవులకీ మెళ్ళోనూ ఏమీ లేవు. చేతులకి మట్టిగాజులు కూడా లేవు కాని కాళ్ళకు అరిగిపోయిన రబ్బరు చెప్పులు చవకబారువి వున్నాయి. ఆకారానికి ఆమె పేదరాలేకాని ఆమె నేత్రాలు అమ్మవారి కళ్ళలా వున్నాయి. ఆమె తలకట్టు ముడివేస్తే దేవాలయ శిఖరంలా వుంటుంది. ఒళ్ళో ముందుకివాలిన ఆమె జడ ధనుర్జ్యావల్లిలా వుంది. ఆమె మాత్రం ఆ సీట్లో బల్లిలా కూర్చొని వుంది. ఆమె మనస్సు రామబాణంలా ఆ యీదురుగాలినీ, కుంభవృష్టినీ, వానచేసే భీభత్సాన్నీ చీల్చుకుని ముందుకు పోతున్నది.

ఆమె ఒళ్ళో పట్టుకున్న సంచీలో ఓ తడిసిన పోస్టుకార్డు ముక్క వుంది. దానిమీది అక్షరాలు కన్నీళ్ళోడుస్తున్నాయి. ఆ సంచీలో చిన్న చిరిగిన ప్లాస్టిక్ పర్సులో బెజవాడకు టిక్కట్టు ముక్కలు, మూడు రూపాయల ముప్పావలా డబ్బులున్నాయి. సుశీల యీ వానలో యీ బస్సులో యిలా వెళ్ళడానికి ఆ కార్డుమీది గీతలే కారణం. ఆ అక్షరాలు కొంతసేపటికి కార్తీక దీపాల్లా వెలిగి ఒక్కో అక్షరం మరో అక్షరంతో కలిసి వూగుతూ తూగుతూ ప్రయాణిస్తున్నాయి. జరిగినదానికీ జరగబోయేదానికీ మధ్య సేతుబంధనంలా వుంది ఆ పోస్టుకార్డు.

—సుశీలను ఆశీర్వదించి మీ మామ గారు జోగినాథం వ్రాయునది. భాస్కరం

ఇన్సూరెన్స్ కాగితాలు, ప్రావిడెంట్ ఫండ్ కాగితాలు వచ్చాయి. అవి నువ్వు వచ్చి సంతకాలు చేస్తే నీకు రావలసిన డబ్బు త్వరలో ముడుతుంది. మిగతా విషయాలు ఇక్కడ మాట్లాడుకోవచ్చు."

భాస్కరానికి ఎంత ఇన్సూరెన్స్ వుందో, అతనికి ఎంత ప్రావిడెంట్ ఫండ్ వస్తుందో సుశీలకు తెలీదు. అతను కాస్త తలవంచి సన్నగా నవ్వినపుడు గీటురాయిమీద మచ్చుకి గీసిన బంగారు గీతలా వుంటుందని అనుకుంది గాని అతనికి లివర్ జబ్బు వుందని తెలుసుకో లేదు. పెళ్ళయిన నెలలో పదహార్రోజుల పండగ దాటాక ఓ అర్ధరాత్రి మంచం మీద గిలాగిలా కొట్టుకుని ఛస్తాడని కూడా ఆమెకు తెలీదు. ఆ పదహార్రోజుల పెనిమిటి దహనకాండ, సంచయనం, నిత్యకర్మలూ ముగిశాక మావగారు జోగినాథంగారు వన్‌టౌన్ నుంచి ఓ ముండను తెస్తారని కూడా ఆ పసిపిల్ల వూహించలేదు. తరవాత తమ పల్లెటూరి నుంచి పంతులుగారొచ్చి తీసికెళ్ళి పోతానన్నపుడు, మావగారు తనదగ్గరే వుంచమని రొక్కించినపుడు యింక అక్కడ ఎందుకుండాలో కూడా అప్పుడు సుశీలకు తెలీలేదు. ఎన్నో తెలీని విషయాలు ఆమెతో నిమిత్తం లేకుండా జరిగిపోయినప్పుడు — మళ్ళీ యిప్పుడీ పోస్టుకార్డ్ — పదహార్రోజుల పెనిమిటి సంపాదనకు తను ఆశపడటం ఎంత వరకు ధర్మమో కూడా సుశీలకు తెలీదు. ఇప్పుడు మాత్రం వానలో ఈ పాత బస్సు తనను మావగారింటికి తీసుకెళ్తున్న పేదరాలి మనసులా వున్న పేద బస్సు నాలుగు కాళ్ళమీద అంటే ధర్మం మీదే నడుస్తున్నట్లు సుశీలకు తోచింది.

—లోకం ధర్మంమీదే నడుస్తూందని సుశీలకు అనిపించడానికి పోస్టుకార్డ్ మాత్రమే కారణం కాదు, పంతులుగారి హోటల్ కూడా ధర్మంమీదే నడుస్తూండ బట్టి తానీ బస్సులో యిలా ప్రయాణం చేయగలుగుతూంది. లేకపోతే సుశీలకు బెజవాడకు బస్సు టికెట్టు చింపి మూడు రూపాయల ముప్పావలా ఎవరు చేతిలో పెడతారు? పెళ్ళయిన రెండో నెల తిరక్కుండా తనను తీసుకొచ్చి మళ్ళీ పన్లో ఎవరు పెట్టుకుంటారు? పంతులు గారి హోటలు అమ్మ కడుపులోలా హాయిగా సుశీలకు చల్లగానే వుంటుంది. కూరలు తరగడం, పిండి కొట్టడం, పిండి రుబ్బడం, పొయ్యి రాజెయ్యడం, ఎసట్లోకి ఏరి కడిగి బియ్యం పొయ్యడం యివన్నీ సుశీలకు అప్పుడెప్పుడం లోకంలో యింకా ధర్మం మిగిలివుండడం వల్లనే అని సుశీల నమ్మకం. తిరిగి రావడానికి ఖర్చులకి డబ్బులట్టికెళ్ళు సుశీలమ్మా అంటే మా 'మావగారిస్తారని' తలొంచుకుని చెప్పింది.

దారిపొడుగునా కురిసింది వానే అయినా బెజవాడలోకి బస్సు రాగానే అది దీపాల పాలవెల్లి క్రిందకు రావలసిన ముఖ్యమైన చుట్టంలా వచ్చినట్లని పించింది సుశీలకు. బస్సు దిగి ఆ చేతి సంచీని గుండెల కదుముకుని షెడ్లో కాస్సేపు నిలబడింది. ఆ పదహారు రోజుల పెనిమిటే యింక కాసిని రోజులుంటే యిప్పుడిక్కడ యీ వానలో యిలా తడవనక్కర్లేకుండా చేయి పుచ్చుకుని యింటికి నడిపించుకు వెళ్ళే వాడపునా అని మనసును చురుక్కు మనిపించింది.

ఇంత వానలో మళ్ళీ యీ కన్నీ రెందు కని ఆమె కళ్ళు తుడుచుకోకుండానే బరువుగా నాలుగడుగులు వేసింది. సత్యనారాయణపురం శివాలయం వీధికి రూపాయిన్నర అడిగాడు తనను ఎగాదిగా చూసికూడా. నడిచి వెళ్ళగలన్లే అని ఆమె సంచీ నెత్తిమీద పెట్టుకుని మూడురూపాయల ముప్పావలాలో రూపాయిన్నర ఖర్చు కాకుండా పేద తల్లులకంతా ఏ దారి రాసిపెట్టివుందో ఆ దారినే నడిచింది.

మావగారు యింటివద్ద వుండరు. ఆ సమయానికి ఆయన పేపరాఫీసులో డ్యూటీలో వుంటారు. ఒకవేళ డ్యూటీ లేకపోతే ఆయన విధిగా ఏ సినిమా హాల్లోనో వుంటారు! 'నీకు తెలుసా మా నాన్నగారు రోజూ సినిమా కెళ్తారు— ఆయన కదో పిచ్చి. మా అమ్మ పోయాక యిలాటి అలవాట్లన్నీ చేసుకున్నార'ని భాస్కరం ఆ పదహారు రోజుల్లోనూ ఓ రోజు చెవిలో చెప్పాడు. ఆయనింటివద్ద లేకపోతే — ఆ తుమ్మమొద్దులాటి ఆడ మనిషి తన్ను లోపలికి రానిస్తుందో లేదో? రానివ్వకపోతే ఎలాగూ వున్నాయి మెట్లు. అక్కడే నిలబడతాను — నా వస్తువే నాకు లేనప్పుడు నన్నెవ్వరింక లోపలికి ఆహ్వానించలేదనే బాధ నాకెందు కుండాలి? ఆ పదహారు రోజులలోనే ఓసారి యిల్లిక్కడే యీ కిళ్లీకొట్టు దగ్గరే నా కొక మిఠాయి కిళ్లీ కట్టించారు మావారు. ఈ వీధిలోనే ఏదో హోటలు వుండాలి. అక్కడ అద్దాల తలుపుల్ని తోసుకునివెళ్ళి లోపల చల్లనిచోట కూర్చుని వెచ్చని కాఫీ కూడా తాగాం. అలా మూణాళ్ళ ముచ్చటే గాకపోతే నా పెనిమిటీ సత్యవంతుడే అవును. ఏ నోములూ నోచలేదు, ఏ వ్రతాలూ చేయలేదు, ఏ దానాలూ యివ్వనిదానికి పురుషుడెలా దక్కుతాడు? పదహారు రోజుల సంసారానికే ఆనా భగవంతుడు యీ కాగితాలమీద సంతకంపెట్టి నా డబ్బు తీసుకో, రమ్మంటున్నాడు. ఆయనకు నామీద ఎంత దయలేకపోతే యీ కార్డు ముక్క ఆ ముసలాయన మనసులోకి దూరి రాయిస్తాడు ?

సుశీల తామిదివరకు వున్న ఇంటి ముందుకు ఎలాగోలా వచ్చి చేరుకుంది. గాని ఆ తలుపులు మూసి తాళంవేసి

వుండడంచేత ఆ మెట్లమీదనే నీడలో తడిసి ముద్దయిన సావిత్రీదేవిలా కూర్చుంది. వర్షంలో వీధి దీపం వుండీ వుడిగీ కన్నుమూసీ తెరిచినట్లు వెలుగు తోంది. ఆ మెట్లమీద అలా కూర్చో కలిగినందుకు సుశీలకు ఏదో హాయిగా వుంది.

గుళ్ళో దేవుడూ నిద్రపోతున్నాడు. గుడిగంటలూ వినబడటంలేదు. ఆ జడి వానలో తడి రిక్షాలూ వాటి గంటలే వాటి గణగణలే, వడివడిగా నడిచే పాదాల సవ్వడులే — వీధి దీపాల వెలుతురు ముక్కల్ని వెదజల్లుతున్న వాన నీళ్లు వాటిలో ప్రతిబింబాలు — ఆ నీటిమీద కాగితం ముక్కలూ, పనికిరాని సిగరెట్ పీకలూ — చెత్తంతా తెట్టుకట్టి దీపం వెలుతురుపడిన మేరంతా ఆక్రమించడం సుశీల గమనిస్తూ కూర్చుంది. ఈ మెట్ల మీద యిక్కడే కూర్చుని సిగరెట్టు తీసి అగ్గిపెట్టె తెచ్చివ్వమని గోలచేసేవాడు అతను. ఇక్కడలా కూర్చుంటే, ఈ తలుపే తెరిచివుంటే, యీ ఇంట్లో కూడా దీపం వెలుగుతూ వుంటే అతను వచ్చి పక్కన కూర్చుని చెవిలో గుసగుసలు చెప్పి నవ్వించేవాడు కాదా ఏం? జీవితాని కంతా శివరాత్రి ఒకే ఒక్కసారి సినిమా కెళ్ళారు. అక్కడతను భుజం మీద చేయి వేశాడు. రిక్షాలో తామిద్దరూ 'అలా గాలిని తేలుచు సోలిపోవుచును' పాట పాడుకుంటూ యింటికి వచ్చారు. తను పాడలేదు — అతనే, చిన్న అపస్వరంతో అన్ని పాటలూ 'యిదిగో విను—యిది విను' అంటూ సినిమా పాటలు పాడేవాడు. అతనింట్లోకి వస్తే పాట ఇంట్లోకి వచ్చినట్లు వుండేది. ఆ రోజు సినిమానించి వచ్చి గుమ్మం మెట్ల వద్ద నాపరాతి సందులో దాచిన తాళంచెవి తీసి భళ్ళున యివే తలుపులు, వీటినే తెరిచారు. అప్పుడు మావగారు పాపం ఆఫీసులోనే పడుకునేవారు. ఈ రోజూ




రారేమో అనుకుంటూ గుమ్మం ముందు నాపరాతి నెరదలో యదాలాపంగా వెతికింది. ఆశ్చర్యం! ఆ తాళంచెవి అక్కడే వుంది. ఈ తాళం చెవితో ఆనాడు తామిద్దరూ ఆడుకున్న ఆటలూ— జ్ఞాపకాలు మాసిపోకుండానే రెండో మనిషి మాయమైపోవాలా? సుశీల మెట్లమీంచి లేచి అప్రయత్నంగా తాళం తీసి తలుపుల్ని తెరిచి లైటువేసింది.

అక్కడ—ఆ దోమతెర, చిన్న నవారు మంచం, గోడను పెళ్ళిఫోటో, క్రింద వారి చిన్న సూట్‌కేసు, అల్మారాలో వారి బీ.కాం. పరీక్ష ప్యాసయిన సర్టిఫికేట్టూ, బ్యాడ్మింటన్ ఆటలో గెల్చుకున్న బుల్లి కప్పూ, వారు అప్పుడప్పుడు వాయించే మౌత్ఆర్గన్ అన్నీ అలాగే వున్నాయి. ఆ సూట్‌కేస్ తెరిచింది, దాంట్లో వారి లుంగీ బుష్‌షర్టూ ఇస్త్రీ చేసినవి ఇస్త్రీ చేసినట్లున్నాయి. మావగారు ఖద్దరు పంచె, సిల్కులాల్చీ వేసుకుంటారు. ఆ లుంగీ, బుష్‌షర్టూ తన మెడమీద కప్పుకుని, వాటిలో తన ముఖం దాచుకుని భాస్కర్ వాసనా సుఖం క్షణకాలం అనుభవించింది. అంతేకాదు ఆ ఇంట్లోకి వచ్చాక గదులన్నీ స్వేచ్ఛగా నిర్భయంగా తిరిగింది. తనకూడా ఎవరో నడిచినట్లు ఉన్నది. అలా ఆ ఇంట్లో తిరుగాడుతూ వుంటే ఆకలి, దాహం ఏమీ గుర్తుకు రాలేదు. కొంతసేపయాక ఆమె వీధి గదిలో ఆ లుంగీ కప్పుకుని ఆ చొక్కా తలక్రింద పెట్టుకుని అలా నేలమీద గాఢ నిద్రలోకి ఒరిగేసింది.

* * *

బయట వాన తగ్గింది. ఇరుగూ పొరుగూ కాస్త అటూ యిటూ కదిలి మెడలు రిక్కించి చూశారు. జోగినాథం గారింటి తలుపులు బార్లా తెరిచివుండడం, లోపల దీపం వెలుగుతూ వుండడం వారు గమనించారు. ఆయన చాలా పొద్దుపోయాక గాక రాడని అందరికీ తెలుసు. అమ్మలక్కలు ఇరుగూ పొరుగూ లోపలికి వచ్చి పరికించారు. సుశీల గాఢనిద్రలో చలనం లేకుండా పడివుంది. ఒకరిద్దరు గుర్తుపట్టి 'పాపం యీ యింటి కోడలల్రా' అని బుగ్గమీద వేలు వేసుకున్నారు. ఆ వచ్చినవారిలో ఎవరో పుణ్యాత్ములు జోగినాథంగారికి ఫోన్ చేశారు. ఆయన కంగారుపడి ఇదిగో వస్తున్నానంటూ బయల్దేరాడు.

జోగినాథంగారి పరిస్థితి ఆ వాడలో చాలా అధ్వాన్నంగా మారింది. కొడుకు పోయాక, కోడలు నెత్తిన ముసుగేసుకుని తనదారిని తను వెళ్ళాక ఆయన్ను

ఒంటరితనం మరీ భయంకరంగా పీడించ సాగింది.

అప్పుడాయన కొందరు మిత్రుల సలహా ప్రోద్బలంతో అదివరకు అలవాటు పడిన ఆడమనిషినే కొండమీద పెళ్ళి చేసుకుని యింటికి తీసుకువచ్చి కొత్త కాపరం పెట్టారు. ఇరుగూ పొరుగూ ముక్కుమీద వేలేసుకున్నారు. బుగ్గలు నొక్కుకున్నారు.

అంతకంటే విపరీతం ఆ ఆడమనిషి మహా రాలుగాయి. ఇరవైనాలుగు గంటలూ అది తెమ్మని, యిది తెమ్మని వేపుకుతినేది. మంచినీళ్ళలా డబ్బు ఖర్చుచేసేది. జోగినాథానికి ఆఫీసులో ఆఫీసుబోయ్‌వద్ద కూడా అప్పు చేయాల్సి వచ్చింది.

అంతేకాదు — ఆమెకు పెత్తనాలు, చిరుతిళ్ళు, సినిమాలు ఎక్కువ. జోగినాథం పెద్ద బురదలో కూరుకు పోయాడు. ఆమెతో సంబంధం పెట్టు కున్నందుకు అతను చాలా పరితపిస్తున్న సమయంలో—మరొక విశేషం జరిగింది.

తను ఇంటివద్ద లేని సమయంలో తన ఇంట్లో ఆమెకోసం వచ్చేవారు బంధువుల మంటూ తిష్టవేసి రంగరంగ భోగాలు జరిపించుకునేవారు. నిత్యం పేకాటలు, తాగుడు, బుడ్లకి బుడ్లు యింటినిండా చేరి యిల్లు సత్రవయింది.

ఆ వచ్చేవారు బంధువులో కాదో జోగినాథానికి తెలియదు. వాళ్ళను వెళ్ళి పొమ్మని చెప్పమని ఆవిడకు చెప్పాడు. ఆవిడ అంతెత్తు లేచింది. తను వెళ్ళి చెప్పాడు—వాళ్ళంతా కలిసి జోగినాథాన్ని తన్ని వీధిలోకి గెంటారు. ఆ వీధివీధంతా —కొడుకు పోయాక ఇటువంటి తెలివి తక్కువపని చేసినందుకు జోగినాథానికి శాస్తి కావలసిందేనని వూరుకున్నారు.

జోగినాథం జాతీయోద్యమంలో వెనక జైలుకెళ్ళాడు. అతను ఓ నాయకుడ్ని పట్టుకుని పోలీసుల ద్వారా వాళ్ళను వెళ్ళగొట్టి — ఆవిడకు నష్టపరిహారం నాలుగు వేలిచ్చుకుని బయటపడ్డాడు. కాని వయసులో కామం కాటేస్తుంది.

ఇప్పుడతనికి ఎటుచూసినా అప్పులు— చచ్చిపోయిన కొడుకు ప్రావిడెంటు ఫండూ, ఇన్సూరెన్సూ వస్తాయేమో అనుకుంటే అవి ఆ నెల్లాళ్ళు కాపరం చేసిన కోడలుపిల్ల సంతకంమీద ఆధారపడివున్నాయి.

* * *

జోగినాథానికి తన సొంత తెలివి తేటలమీద నమ్మకంలేదు. అతను గాంధీనగరం వెళ్ళి దూరపు చుట్టం ఒక ముసలమ్మను వెంటబెట్టుకుని వచ్చాడు. అతనికి ముసలివాళ్ళు తప్పకుండా తెలివైనవాళ్ళయి వుంటారని ఓ నమ్మకం వుంది.

"పిల్లవాడి పెళ్ళికి రెండువేలు అప్పయింది" అని మూలిగాడు.

"వాళ్ళేమీ యివ్వలేదా?" అంది ముసలమ్మ.

"పదిహేనువందలిచ్చి గుళ్ళో పెళ్ళి చేశారు."

"సరే, వాళ్ళది వాళ్ళకిచ్చేయ్."

"అదికాదు అత్తయ్యా. పిల్లాడి వైద్యానికేం ఖర్చు కాలేదనుకో. దిన వారాలకి మరో వెయ్యి తగిలింది."

"దాని రాతలా రాసుంది."

"దాని రాతకాదు నారాత. నాకా పిల్లతో ఎలా మాట్లాడాలో తెలీడంలేదు."

"అవునది ఇంట్లోకెలా వెళ్ళింది?"

"తాళంచెవి ఎక్కడ దాస్తానో వాడు దీనికి చెప్పి వుంటాడు."

"తెలివైందే, అదృష్టం లేకకాని—"

"ఇప్పుడేంచేద్దా మంటావత్తా?"

"దాని డబ్బు దానికిచ్చేయాలి, అది నీకేదన్నా యిస్తే పుచ్చుకో."

"ఇందుకా నిన్ను పిలుస్త — నేను పూర్తిగా మునిగిపోయి వున్నాను. నాకేదన్నా ఉపకారం చేస్తావని...."

"ఏం లాభం నాయనా—దాన్నెవర్తెనో తెచ్చి ఇంట్లో పెట్టావు. ఛీఛీ అని జనం వుమ్మేశారు. లెక్కచెయ్యకుండా దాని మెళ్ళో తాళి కట్టావు. ఆ బజారు మనిషి నిన్ను బజారుకీడ్చింది. దానికెంతో ముట్ట జెప్పావు. కొడుకు చావువల్ల నష్ట పోయానంటావేమిటి?"

"వాడి జబ్బు నయం కాదనీ తెలుసు. డాక్టర్లు వద్దన్నారు కూడా."

"మరెందుకా పిల్ల గొంతుకోశావ్?"

"ఈ డాక్టర్లేం దేవుళ్ళా, పెళ్ళయితే అన్ని రోగాలూ కుదుర్తాయని వెంకటేశ్వరస్వామికో మొక్కు మొక్కాను."

"ఆ పదిహేను వందలకీ కక్కుర్తి పడ్డాను అనవు."

"అదంతా తర్వాతిప్పుడు. ఆ కాగితాలు నువ్వాపిల్లచేత సంతకం చేయించాలి."

"ఏం చెప్పమంటావు?"

"అది నువ్వే ఆలోచించు. అందుకే నిన్ను పిలుస్త—"

"అదిప్పుడేం చేస్తోంది?"

"దీనికో ముసలి మేనత్తవుంది. అది ఓ పంతులి హోటల్లో ఖమ్మం వద్ద పల్లెటూళ్ళో పనిచేస్తోంది. ఇప్పుడిది కూడా ఆ పంతులి హోటల్లోనే పని చేస్తోంది. వాడే అమ్మాయికి గార్డియన్. చిన్నప్పట్నుంచీ అక్కడే పెరిగింది."

"ఈ సంబంధం ఎవరు తెచ్చారు?"

"నేనోమాటు పేపర్ల వాళ్ళతో అటుకేసి క్యాంపు వెళ్ళినప్పుడు పంతులే యీ పిల్లకేదన్నా పెళ్ళి సంబంధం చూడమని పోరాడు. ఉపకారం చేద్దామని నాకనిపించింది. ఈ అమ్మాయి వంట అత్యద్భుతంగా చేస్తుంది."

"మరింకే, ఆ అమ్మాయి నిక్కడే వుండమను. నీకు వండిపెడుతుంది."

"పంతులు ఒప్పుకుంటాడా?"

"వాడిచ్చిన పదిహేను వందలూ వాడి మొహాన కొట్టేయ్."

"అది యిష్టపడుతుందా?"

"యిష్టవేవిటి కష్టవేవిటి? దాని బతుకు ఎక్కడో అక్కడ తెల్లవారాలి గదా!"

"నువ్వు చెప్పి ఒప్పించు. ఆ డబ్బు పలావులయిపోదు. నేనా అప్పులపాలు కాను."

"అవును—వాడికి మాసికాలన్నా పెడుతున్నావా?"

"ఆడదిక్కు లేనివాడ్ని—నా కివన్నీ ఎలా సాగుతాయ్. ఆ రోజు ఓ బ్రాహ్మడ్ని తీసికెళ్ళి కాఫీహోటల్లో టిఫిన్ పెట్టించేసి ఓ రూపాయిచ్చి పొమ్మంటున్నాను."



"ఇప్పుడు దానిచేతే చేయించు. దానికి నీ మీద నమ్మకం కుదురుతుంది."

"తప్పకుండా—నువ్వీరాత్రికి ఇక్కడే వుండి దానికి నూరిపొయ్యాలి."

* * *

ఎవరో మొహంమీద నీళ్ళు చల్లారు. సుశీల కళ్ళు తెరిచి చూసింది. హఠాత్తుగా గాఢనిద్రలోంచి లేచిన వాళ్ళకి ప్రపంచం మగత మగతగా వున్నట్లు—ఆమెకి ఏమీ గుర్తుకురావటంలేదు.

"ఈ పళ్ళు తిను—ఈ మజ్జిగ తాగు" అని ఆవిడ అరటిపళ్ళను, మజ్జిగ గ్లాసును దగ్గరపెట్టి తట్టి లేపింది.

సుశీలకు తల దిమ్మెక్కిపోయి వుంది. కళ్ళు మూరుకుపోతున్నాయి. ఆవిడ పండు ఒలిచి చేతికందిచ్చింది. సుశీల ఆ పండు తినేసింది. మజ్జిగ యిచ్చింది. మజ్జిగ తాగి మళ్ళీ పడుకుంది.

ఆ ముసలమ్మ మళ్ళీ మొహంమీద నీళ్ళు చల్లి—

"మీ మామగారు నీతో మాట్లాడుతానంటున్నారు. కాస్త లేచి కూచో" అని తట్టి కుదిపింది. సుశీల 'అబ్బ నిద్దరొస్తోంది' అని అటు తిరిగి పడుకుంది.

"బాగా నిద్రమైకంలో వుంది. కొందరింతే—"

"పోనీ ఆ కాగితాలమీద యిలాంటప్పుడే సంతకం పెట్టించేస్తే—" అన్నాడు జోగినాథం, తెలివొస్తే అసలేమీ పని జరగదనే అనుమానంతో.

ముసలమ్మగారు ముఖవంతా నీళ్ళతో తుడిచి తట్టి మళ్ళీ లేపి కూర్చోపెట్టారు. ఈ మారు కళ్ళువిప్పి పెద్ద పెద్ద కళ్ళతో చూసింది.

"అమ్మాయి ఎక్కడి కొచ్చావో గుర్తుందా?"

సుశీల తల వూపింది.

"ఈయన మీ మావగారు తెలుసా?"

మళ్ళీ తల వూపింది.

"కాగితాలేవో సంతకాలు పెట్టాలిట. నువ్వు పెడతావా?"

సుశీల తలాడించింది.

జోగినాథం వెళ్ళి సొరుగులోని కాగితాలు తెచ్చి అవి ముసలమ్మగారి చేతికిచ్చి ఆశగా నిలబడి సుశీలకేసి చూశాడు. సుశీల కళ్ళు తెరిచే రెప్పవాల్చకుండా ఎటో చూస్తోంది.

ముసలమ్మగారు కాగితాలు ఆమె చేతికిచ్చింది.



"కూర్చో—కూర్చుని మీ మావగారు చూపించినచోట సంతకం పెట్టు."

సుశీల కాగితాలు తీసుకుని ఒళ్ళో పెట్టుకుంది. కలం కూడా అందుకుంది. కాని ఎటో చూస్తోంది.

"దీని చూపులు భయం వేస్తున్నాయ్" అంది ముసలమ్మగారు గొణుగుతూ. జోగినాథం భయపడ్డాడు.

"వూ" సంతకం పెట్టమ్మా. ఇందాక తలాడించావుగా" అంది ముసలమ్మ.

జోగినాథం అట్టతెచ్చి అందివ్వబోయాడు. సుశీల చేతులు వెనక్కు లాక్కుంది.

"పోనీ ఆ కాగితాలు తీసుకో— తెల్లారి తెలివొచ్చాక అదే పెడుతుంది" అంది ముసలమ్మగారు.

జోగినాథం ఆ కాగితాలు మళ్ళీ తీసుకోబోయాడు. సుశీల ఆ కాగితాల్ని గట్టిగా పట్టుకుని తన గుండెల కదుముకుని మళ్ళీ పడుకుంది.

ముసలమ్మగారూ, జోగినాథం యిద్దరూ తెల్లబోయారు.

"పోన్లే ఓ రాత్తిరి నిద్దట్లో అదే వదిలేస్తుంది. అప్పుడు తీసి జాగ్రత్త చెయ్యొచ్చు" అంది ఆవులిస్తూ ముసలమ్మగారు.

"చింపేస్తుందేమో" అని భయపడ్డాడు జోగినాథం.

"దాని మొహం-అది నిద్దరోయింది-" అంటూ ముసలమ్మగారు సుశీల ఒళ్ళో ముడిచి పెట్టుకున్న ఆ కాగితాలను తీయాలని చూసింది.

కాని సుశీల గుప్పిడి మరీ బిగుసుకుంది.

"తెల్లారి చూసుకోవచ్చు — నువ్వు నిద్రపో" అని ముసలమ్మగారు సుశీలకు సమీపంలో చాప వాల్చుకు నడుం వాల్చింది.

జోగినాథం కాలుగాలిన పిల్లిలా అక్కడే తిరుగుతున్నాడు.

* * *

సుశీలకు నిద్రలో ఓ కల—

ఆ కలలో సుశీలచుట్టూ పెద్ద పెద్ద మంటలు — సహస్ర బాహువుల్తో ఆ మంటలు తన్ను కమ్మేస్తున్నాయి. ఒళ్ళంతా నిప్పుల్లోకి త్రోసినట్లు మండిపోతోంది.

"అమ్మో .... అమ్మో...." అంటూ పెద్ద పెద్ద కేకలు పెట్టింది.

ఆ మంటలు జోగినాథం చేతులే—

అది కలకాదు—జోగినాథవే.

సుశీల భయంతో పెద్ద పెద్ద కేకలు పెట్టింది. జోగినాథం నోటికడ్డంగా చేతులు పెట్టి "అరవకు అరవ"కంటున్నాడు.

ఆ గందరగోళానికి లేచిన ముసలమ్మగారికి అర్థమయి రెండుచేతుల్తోనూ జోగినాథాన్ని బాత్తూ 'ఈ పిల్లని చంపేస్తున్నాడు. బాబోయ్—రక్షించండి' అని అరచింది.

జోగినాథం ఆ అమ్మాయితో పెనుగులాడుతున్నాడు. సుశీల అరుస్తోంది— ఏడుస్తోంది.

వీధి ముందు జనం పోగయ్యారు. ముసలమ్మగారు తలుపులు తీయడానికి వెళ్తే ఆమెను పడత్రోశాడు.

సుశీల బాణంలా దూసుకుని వెళ్ళి తలుపు తీసి వీధిలోకి పరుగెత్తింది.

"ఏంజరిగిందమ్మా" అంటూ జనం కర్రలతో లోపలికి దూసుకువచ్చారు.

"ఈ ఛండాలుడు ఆ పిల్లను పాడు చేయబోయాడు" అని ముసలమ్మగారు "కోడల్ని లొంగదీసుకుంటే అది జన్మంతా యిక్కడే అణిగి మణిగి పడి వుంటుందని వీడి కుట్ర" అని ఛీత్కారం చేసింది.

"ఇలాటివాడిని ప్రాణాల్తో వదలకూడదు" అని జనం కర్రలెత్తి కుళ్ళబొడిచారు.

"నన్ను చంపకండి బాబో" అని జోగినాథం దండాలెడుతూ అరుస్తున్నాడు. నీ కోడలికి దండం పెట్టు అంటున్నారు వాళ్ళు.

అతని ఆర్తనాదం అంత దుఃఖంలో వున్న సుశీలకు వినిపించింది. పరిగెత్తుకుంటూ వచ్చి, "ఆగండి. ఆయన్ని చంపకండి" అని లేచిన కర్రలకు అడ్డు వెళ్ళింది.

ఎత్తిన కర్రలన్నీ ఆకాశంలో నిలచిన ఆశ్చర్యార్థకాల్లా వున్నాయ్.

"మీ దగ్గరెక్కడన్నా కలం వుంటే యివ్వండి" అంది. ముసలమ్మగారే కలం తెచ్చి యిచ్చింది.

తన బొడ్లోవున్న కాగితాలను తీసి సంతకం పెట్టి అతని మీదకు విసిరేసి—

"ఆయన్ని చంపకండి. ఆయన నాకు మావగారు. నా భర్తకు తద్దినాలు పెట్టాలి" అని విసవిసా వీధిలోకి నడిచి వెళ్ళిపోయింది.

